క్లుప్తంగా

ఆశ్రమాల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

ముత్తుకూరు : ముత్తుకూరు సమీపంలోని రామలింగాపురంలో మత్స్యకారుల అనాథ-వృద్ధాశ్రమాల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఇప్పటి వరకు మండలంలో ఇలాంటి ఆశ్రమాలు లేవని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఆశ్రమాల నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



దుకాణాల ముందు భాగాలను తొలగించిన దృశ్యం

ముత్తుకూరు : ఇరుకుగా మారిన ముత్తుకూరు మండల కేంద్రంలోని రోడ్డులో ఆక్రమణాల తొలగింపు ప్రక్రియ సోమవారం కూడా కొనసాగింది. గత వారం రోజులుగా ఆక్రమణల తొలగింపు జరుగుతోంది. రోడ్డుకు ఇరువైపులా ముందుకు చొచ్చుకు వచ్చిన కట్టడాలను, మురుగుకాలువపై నిర్మించిన మెట్లను యంత్రాల ద్వారా తొలగిస్తున్నారు. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా సర్వేపల్లి, వెంకటాచలం వరకు రూ.12 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఒక వైపు ఆక్రమణల తొలగింపు, మరో వైపు విస్తరణ పనులు జరుగుతున్నాయి.

పొగాకు బ్యారన్ దగ్ధం



పొగాకు బ్యారన్‌లోంచి బయిటికి వస్తున్న పొగలు

మర్రిపాడు: మండలంలోని పొంగూరుకండ్రిక గ్రామంలో గాలిబోయిన పెంచలయ్యకు చెందిన పొగాకు బ్యారన్ సోమవారం అగ్నికి ఆహుతైంది. రైతు పెంచలయ్య గ్రామంలో తనకున్న పొలంలో పొగాకు పంట సాగు చేసి బ్యారన్‌లో క్యూరింగ్ చేసుకునేవాడు. అయితే సోమవారం ఉదయం బ్యారన్ అరుదల సమయంలో కర్రలు జారి నీటిగొట్టంపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు వచ్చేలోపే బ్యారన్‌లోని పొగాకు, అల్లుడుకర్రతోపాటు సర్వం కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని బాధిత రైతు పెంచలయ్య వాపోయాడు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బద్దెవోల పంచాయతీ పల్లెపాళెంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూడున్నరేళ్ల కాలంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, తాగు, సాగునీరు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా పథకాలు ఆగితే సమస్యలను గుర్తించి అర్హులైన వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల పింఛన్ల నిర్ధారణ కోసం వచ్చిన నోటీసుల్లో మరణించిన వారు తప్ప మిగిలిన అందరికీ పింఛన్లు పునరుద్ధరించినట్లు తెలిపారు. ఏడాదికి కేవలం పింఛన్ల కోసమే రూ.21 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. బద్దెవోలు గ్రామంలో పురాతన శివాలయం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టామని తెలిపారు. కళ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నా ప్రతిపక్ష నేతలు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లేందుకు పసలేని విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్, ఏఈలు కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, సర్పంచ్ ఉగ్గుమూడి శశిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఏడెం మల్లికార్జునరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, శానంపూడి సురేందర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లల చదువుకు భరోసా



చిన్నారులతో మాట్లాడుతున్న కాకాణి

పిల్లలూ చదుకు కుంటారా.. నేను చదివిస్తా అంటూ గిరిజన చిన్నారులకు మంత్రి కాకాణి భరోసా ఇచ్చారు. పల్లెపాళెంలో పర్యటిస్తున్న కాకాణికి ఓ ఇంట్లో 12 ఏళ్లు, తొమ్మిదేళ్ల వయస్సు గల ఇద్దరు ఆడపిల్లలు కనిపించారు. ఏమి చదువుతున్నారని ప్రశ్నించగా అక్క నాగమణి ఏడో తరగతి మధ్యలో ఆపేశానని, చెల్లి మాధవి నాలుగో తరగతి చదువుతూ ఆపేశానని తెలిపారు. తల్లి లేని వారిద్దరికీ తండ్రి ఉన్నాడని తెలిసింది. పిల్లలిద్దరి చదువు బాధ్యత తాను తీసుకుంటానని వారిని బడికి పంపే ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు సూచించారు.

మంచి మార్కుల సాధనకే 'పురోగామి'

- ఆర్జేడీ సుబ్బారావు



కొత్తూరులో పదో తరగతి విద్యార్థి నివాసంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

ఇందుకూరుపేట : విద్యార్థుల అభ్యసనాన్ని పటిష్టపరిచి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ప్రభుత్వం 'పురోగామి' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వీఎస్ సుబ్బారావు అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఉషారాణితో కలిసి సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి వద్ద ఉన్న పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించి, తల్లిదండ్రులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల అనంతరం చదువులో వెనుకబడిన విద్యార్థుల నివాసాలకు వెళ్లి తల్లిదండ్రులతో విద్యార్థి స్థాయిని వివరించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిరోజు రెండు పరీక్షలు నిర్వహించి, సమాధాన పత్రాల మూల్యాంకనం చేపట్టాలన్నారు. ఈ రిపోర్టు కార్డులను తల్లిదండ్రులకు అందజేయాలని పేర్కొన్నారు. ఇవే పురోగామి కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలని వివరించారు. ఇలా విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి చేయాలని కోరారు.

ఉల్లికోడును నివారించుకోండి



కొడవలూరు : పాతవంగల్లులో వరి పొలాలను పరిశీలిస్తున్న డీఆర్‌సీ బృందం

- డీఆర్‌సీ డీడీఏ శివన్నారాయణ

కొడవలూరు : వరి పంటను ఉల్లికోడు ఆశిస్తున్నందున తగిన చర్యలు చేపట్టి నివారించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ సూచించారు. మండలంలోని పాతవంగల్లులో ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలతో కలిసి ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 వరిరకాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి డీడీఏ మాట్లాడుతూ ఉల్లికోడును నివారించుకోకుంటే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పిప్రోనిల్ గుళికలు ఉపయోగించడం ద్వారా ఉల్లికోడును నివారించుకోవాలని చెప్పారు. అనంతరం రైతులకు వరిలో సమగ్ర సస్యరక్షణ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సురేఖ, ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏ సీహెచ్.వంశీకృష్ణ, రైతులు వేమూరి తిరుమల, అబ్బయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే చానల్‌తో సందేహాల నివృత్తి

ఆర్బీకే చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవడం వల్ల రైతుల అన్నిరకాల సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని డీడీఏ శివన్నారాయణ సూచించారు. మండలంలోని తాటాకుల దిన్నెలో రైతులకు సోమవారం ఆర్బీకే చానల్‌పై అవగాహన కల్పించారు. స్థానిక రైతులతో చానల్ సభ్యత్వం నమోదు చేయించి సూచనలిచ్చారు. వరిలో తెగుళ్లకు సంబంధించి మాత్రమే కాకుండా పంటలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా వీడియోల రూపంలో చూసి స్పష్టంగా నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం వరిలో సామూహిక ఎలుకల నివారణ ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, రైతు నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలను నివారించాలి

ఇందుకూరుపేట : రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు గ్రామాల్లో ఎలుకల మందును ఆయన సోమవారం పంపిణీ చేశారు. అనంతరం రైతులకు వాటిని వినియోగించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏ తిరుమలరావు, దీక్షిత, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : ఎలుకల ముందు వినియోగంపై సూచనలు చేస్తున్న ఏడీఏ

మాదక ద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు



కృష్ణపట్నం హైస్కూల్‌లో మాట్లాడుతున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని, యువత వీటికి దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ అన్నారు. ముత్తుకూరులోని మత్స్యకళాశాల, కృష్ణపట్నంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. చెడు స్నేహాల కారణంగా యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడే ప్రమాదం ఉందన్నారు. వీటికి బానిసలైతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. నైతిక విలువలు పాటిస్తూ తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రయాణం.. మరింత సురక్షితం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : వాహనదారులు హెల్మెట్ ధరించి మోటార్‌బైక్‌లు నడపడం మరింత సురక్షితమని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాల మేరకు ఎస్సైతో సహా పోలీసులు హెల్మెట్లు ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. అందుకు సంబంధించి సోమవారం పోలీస్‌స్టేషన్ నుంచి కోవూరు బజార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి తప్పిదాల వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాల మీదకు వస్తున్నాయన్నారు. ఎక్కువ భాగం చనిపోయిన వారిలో తలకు తీవ్రగాయాలై చనిపోతున్నారన్నారు. మరణాలు తగ్గించాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, బీసీ సెల్ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంజనరావు, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని రామతీర్థంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలని అంబేడ్కర్ యువజన సంఘ దళిత నేతలు సోమవారం జేసీ కూర్మనాథ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతి పత్రాన్ని అందించినట్లు దళిత నేత ఎల్లు సాల్మన్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామతీర్థంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న నీటిపారుదల శాఖ స్థలాన్ని స్థానికులు ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించుకున్నారని తెలిపారు. దీంతో అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా పోయిందని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో దళిత నేత ఎం.నవీన్ పాల్గొన్నారు.

నేడు చవటపాళెంలో 'గడప గడపకు..'

వెంకటాచలం : మండలంలోని చవటపాళెం గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య సోమవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని తెలియజేశారు.

మంత్రి కాకాణి పరామర్శ

మనుబోలు : మనుబోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కుడమల వెంకటరమణయ్యగౌడ్‌ను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. వెంకటరమణయ్య తల్లి శేషమ్మ అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆయన్ను కాకాణి పరామర్శించి శేషమ్మ మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, కోటేశ్వరగౌడ్, భాస్కర్‌గౌడ్, తులసీరాం తదితరులు ఉన్నారు.

నేడు తిరుమలకు మహా పాదయాత్ర

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి తిరుమలకు మంగళవారం ఉదయం మహా పాదయాత్ర బయలుదేరుతుందని దేవస్థానం చైర్మన్ బి.మాలకొండారెడ్డి సోమవారం తెలిపారు. పట్టణంలోని కేశర్లస్వామి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్ర చేసే భక్తులకు భోజన వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు దేవస్థానం వద్ద పేర్లు నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు.

సుందరబాబుకు రవివర్మ అవార్డు



సుందరబాబుకు అవార్డును అందజేస్తున్న అతిథులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని ముదివర్తి గ్రామానికి చెందిన చిత్రకళాకారుడు మున్నం సుందరబాబుకు రవివర్మ కేసీపీ అవార్డు వరించింది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన అమలాపురంలోని సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్రకళా పరిషత్ 31వ అంతర్జాతీయ చిత్రకళా పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో తాను గీసిన కార్తీక పౌర్ణమి చిత్రానికి రవి వర్మ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డును అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, ఆంధ్రప్రదేశ్ దృశ్యకళా చైర్‌పర్సన్ కూడిపూడి సత్యశైలజా భరత్, ఇతర అతిథుల చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు సుందరబాబును అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పెనుబల్లిలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్థానిక సర్పంచ్ ఓడా పెంచలయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు కూడా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి భోజనం బాగుందని, మెనూ పక్కాగా అమలవుతోందన్నారు. ఆయన వెంట కోవూరు ఏఎంసీ డైరెక్టర్ జొన్నవాడ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమష్టి జీవనానికి గాంధీ మార్గమే శరణ్యం

- ప్రభుత్వ చీఫ్ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్
- జాతిపితకు ఘన నివాళి



ఇందుకూరుపేట : గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాణిక్య వరప్రసాద్

ఇందుకూరుపేట : ప్రజలందరూ సమష్టిగా జీవించాలంటే గాంధీ మార్గమే శరణ్యమని మాజీ మంత్రి, ప్రభుత్వ చీఫ్ విప్ డొక్కా మణిక్య వరప్రసాద్ అన్నారు. మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ దేశంలోని అన్నివర్గాల్లో స్ఫూర్తిని రగిలించి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారన్నారు. గాంధీజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమం పోరాటయోధులకు వేదికగా నిలిచిందన్నారు. పొనకా కనకమ్మతో పాటు పలువురు మహానుభావులు ఆశ్రమ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించారన్నారు. ఇక్కడి నుంచి స్వాతంత్ర్య పోరాటాలు సాగాయన్నారు. నేటి బాల బాలికలు మహాత్ముని జీవితాన్ని తప్పక అధ్యయనం చేయాలన్నారు. ఆయన బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. సర్వోదయ రిటైర్డ్ ప్రిన్సిపల్ కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. తొలుత గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. చిన్నారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, రెడ్‌క్రాస్ ట్రెజరర్ సురేష్‌జైన్, రెడ్‌క్రాస్ ఎంపీ మెంబర్ రాజేంద్రప్రసాద్, ఎడబల్లి సురేష్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యం, ఆశ్రమ కోర్ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, గంపల మంజుల, ఆశ్రమ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతిని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, విద్యా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో..

పొదలకూరు : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సభను స్థానిక పంచాయతీ బస్టాండ్లో ఆర్యవైశ్య ప్రముఖులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

అహింసా మార్గమే జాతిపిత ఆయుధం

కొడవలూరు : అహింసా మార్గాన్నే జాతిపిత మహాత్మా గాంధీ ఆయుధం అని హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయుధాలుగా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్న మహనీయుడు గాంధీజీ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని బి.శ్రీశైల, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీపార్కు వద్ద..

కోవూరు : జాతిపిత వర్ధంతి సందర్భంగా కోవూరులోని గాంధీపార్కు వద్ద మహాత్ముని విగ్రహానికి డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాంధీ అడుగుజాడల్లో యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, గంగవరం ఉపసర్పంచ్ మోషే, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నేతలు చిరంజీవి, భాస్కర్, రమణారెడ్డి, శివారెడ్డి, అంజనరావు, చింటు తదితరులు పాల్గొన్నారు.

- కోవూరు ఆర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మునికి నివాళులర్పించారు. సంపత్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



పొదలకూరు బస్టాండ్లో..



కొడవలూరు : వెంకన్నపురం పాఠశాలలో..



కోవూరు : గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఏఏబీ చైర్మన్